ప్రజాశక్తి
సోమవారం 15 డిసెంబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆదాయార్జనపై విశాఖ పోర్టు దృష్టి

◆ బెర్తుల ఆపరేషన్, నిర్వహణపై కసరత్తు

◆ రూ.వెయ్యి కోట్ల ఒఅండ్‌ఎం పనులకు త్వరలో టెండర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టు అథారిటీ (విపిఎ) ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో క్రియాశీలంగా వ్యవహరిస్తోంది. ఒకవైపు వాణిజ్యంలో ప్రత్యామ్నాయ సరుకు రవాణాపై దృష్టిసారించి రికార్డులు నెలకొల్పుతున్న విపిఎ పోర్టు లోపల బెర్తులు, ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఒఅండ్‌ఎం)లో పలు చర్యలకు శ్రీకారం చుడుతోంది. సుమారు రూ.వెయ్యి కోట్ల మేర టెండర్లను త్వరలో ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. వెస్ట్ క్యూ - 1 అండ్ ఆర్ఇ బెర్త్, వెస్ట్ క్యూ 2, 4 ఈస్ట్ క్యూ - 4, ఇక్యూ -3లో హేండ్లింగ్ క్లీన్ కార్గో నిమిత్తం త్వరలో టెండర్లను పిలిచేందుకు పోర్టు అధికారులు సన్నాహాలు చేపట్టారు. పోర్టు ఆసుపత్రి వ్యవహారాన్ని కూడా ఒక కొలిక్కి తీసుకు వచ్చే దిశగా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీన్ని కూడా ఒఅండ్‌ఎంకు ఇస్తారా ? లేదా ? అన్నది చూడాల్సి ఉంది.



విశాఖ పోర్టు (ఫైల్ ఫొటో)

ప్రైవేటుకు పోర్టు ఆడిటోరియం నిర్వహణ

ఇప్పటికే పోర్టుకు సంబంధించిన కళావాణి ఆడిటోరియం నిర్వహణపై పోర్టు ట్రస్టు యాజమాన్యం కోర్టులో లీజుదారు కాశీవిశ్వనాథ్‌పై కేసు వేసి స్వాధీనానికి అన్ని చర్యలనూ తీసుకుంది. పోర్టు నిర్వహణలో పూర్తిగా ఇది కొనసాగేలా ఉన్నతాధికారులు త్వరలో బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. ఆడిటోరియంలోగల పలు స్థలాలను ప్రైవేట్ వ్యక్తి ఇష్టారాజ్యంగా వినియోగించడం, నిర్మాణాలు చేపట్టడం పట్ల పోర్టు ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నారు. పోర్టు ఆస్తులను కాపాడుకోవడం, నిర్వహణా భారంగా ఉండే బెర్తులను ప్రైవేట్ వారికి ఇవ్వడం, పలు అంశాల్లో పోర్టు అజమాయిషీ ఉండేలాగ టెండర్ల ప్రక్రియను త్వరలో చేపట్టడం వంటి చర్యలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రూ.వెయ్యి కోట్ల విలువైన ఒఅండ్‌ఎం బెర్తుల నిర్వహణకు చకచకా ఫైళ్లు కదులుతున్నాయి.



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

కార్మికులకు నష్టం చేకూర్చే..

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

◆ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

◆ సంఘం అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణం రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో మొట్టమొదటిసారి జరుగుతున్న నేపథ్యంలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4న విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి జరిగే మహా ప్రదర్శనకు కార్మిక కుటుంబాలను కదిలించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జగదాంబ వద్దగల సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత మహాసభ దగ్గర పడుతున్న నేపథ్యంలో మొత్తం నాయకత్వం, కార్యకర్తలు మహాసభల జయప్రదం కోసం కృషి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో శ్రామిక ఉత్సవాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో, పోరాటాలు, చరిత్రకు మిగతా 2లో..

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమేదీ ?

▶ వార్త 2లో..

ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కుట్ర

▶ వార్త 5లో..

మాస్టర్ అథ్లెటిక్స్‌లో గీతాలక్ష్మికి స్వర్ణం

▶ వార్త 5లో..

నేవీ మారథాన్‌కు స్పందన

17 వేల మందికిపైగా రన్నర్లతో కోలాహలంగా సాగర తీరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేవీ డే వేడుకల్లో భాగంగా విశాఖ నగరంలో తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 10వ వైజాగ్ నేవీ మారథాన్‌కు ఆదివారం విశేష స్పందన దక్కింది. ఆర్‌కె బీచ్‌లో సందడి వాతావరణం కనిపించింది. ఇతర దేశాల నుంచి కూడా రన్నర్లు హాజరయ్యారు. 17,500 మందికిపైగా ఈ మారథాన్‌లో పాల్గొన్నారు. ఫుల్ మారథాన్‌ను బీచ్ రోడ్డులోని విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్ వద్ద తూర్పు నావికా దళ విభాగాధిపతి సంజయ్ భల్లా, హాఫ్ మారథాన్‌ను నేవీ వెల్ఫేర్ అండ్ వెల్నెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు, సిఎన్‌సి సతీమణి ప్రియా భల్లా, 10కె రన్‌ను విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, 5కె రన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. రోజువారీ పనులలో మానసిక ఒత్తిడికి గురవుతున్న ప్రజలను ఒత్తిడి నుంచి దూరం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు నేవీ ఉన్నతాధికారులు తెలిపారు. మారథాన్‌ను సజావుగా నిర్వహించడానికి సుమారు వెయ్యి మంది సిబ్బంది, 2000 మంది వాలంటీర్లు సహాయ సహకారాలు మిగతా 2లో..



మారథాన్‌లో పాల్గొన్న యువకులు

సూపర్ బజార్‌పై పటిష్ట ప్రణాళికలు

◆ నష్టాల నుంచి లాభాల వైపు తీసుకెళ్లే ఆలోచనలు

◆ సంక్రాంతికి భారీగా ఆఫర్లు ◆ 'ప్రజాశక్తి'తో సంస్థ ఎమ్‌డి శ్రీరామమూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

చాలా కాలంగా నష్టాల బాటలో పయనిస్తున్న విశాఖపట్నం సూపర్ బజార్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని, అందుకోసం వినియోగదారులకు పలు రాయితీలు కల్పిస్తున్నామని సూపర్ బజార్ ఎమ్‌డి పి.శ్రీరామమూర్తి తెలిపారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన పలు విషయాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

సూపర్ బజార్ నిర్వహణ తీరుపై సందేహాలు వ్యక్తపరుస్తూ ప్రముఖ కంపెనీలు సరుకులు ఇవ్వడం లేదని తెలిసింది.. నిజమేనా ?

ఇది గతం. నేను ఎమ్‌డిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పెద్ద పెద్ద కంపెనీల వారితో మాట్లాడి సరుకులు తక్కువ ధరకు వచ్చేలా చూస్తున్నాను. సరుకులు వచ్చిన వెంటనే చెక్కులు ఇస్తున్నాం. వాటిని వెంటనే నగదుగా మార్చుకుంటున్నారు.

సూపర్ బజార్ సరుకులను గతంలో ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసేవి.. ఇప్పుడు పరిస్థితి ఏమిటి ?

సూపర్ బజార్ పాత వినియోగదారులు ఆంధ్ర యూనివర్సిటీ, ఐటిడిఎ, పాలిటెక్నిక్, ఐఎస్‌డిఎస్ వగైరా. వాటి జాబితాలను పరిశీలించి నేరుగా అక్కడికే వెళ్లి ఉన్నత అధికారులతో మాట్లాడటం జరిగింది. సూపర్ బజార్ నుంచి సరుకులు కొనుగోలు చేసేందుకు వారు అంగీకరించారు.





సెల్ఫ్ సర్వీస్ సెంటర్ పనితీరు ఎలా ఉంది ?

సూపర్ బజార్ ప్రధాన కేంద్ర ఆవరణలో స్వయం సేవా కేంద్రం (సెల్ఫ్ సర్వీస్ సెంటర్) ఉంది. అందులో రోజుకు రూ.700 నుంచి రూ.1000లోపే వ్యాపారం సాగేది. అక్కడ పనిచేసే సిబ్బంది జీతభత్యాలకు కూడా సరిపోయేది కాదు. దీనిని సరి చేశాం. ఇప్పుడు రోజుకు రూ.15 వేలు నుంచి రూ.25 వేల వరకు సరుకులు తీసుకు వెళుతున్నారు.

సంక్రాంతికి సూపర్ బజార్‌లో ఆఫర్లు ఉన్నాయా ?

వచ్చే ఏడాది మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బహిరంగ మార్కెట్‌లో రూ.1000 ఉండే సరుకులను రూ.499కే అందిస్తాం. దాదాపు సగం ధర తగ్గించి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సూపర్ బజార్‌పై పటిష్ట ప్రణాళికలు

ఇస్తున్నామంటే ఇది భారీ ఆఫర్ అనే చెప్పొచ్చు. దసరా, దీపావళికి రూ.2,333 విలువచేసే సరుకులను రూ.2 వేలకే అందించాం. ఆఫర్ ఇంకా కొనసాగుతోంది.

సూపర్ బజార్ సిబ్బందికి మీరు ఇచ్చే భరోసా ?

సూపర్ బజార్ అభివృద్ధిలో భాగంగా సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి, సభ్యులకు కొన్ని రకాల సరుకులపై బిల్లులో 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నాం. అలాగే సరుకుల అమ్మకాలు పెంచే సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాం.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

సంబంధించిన ఎగ్జిబిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లాలో విస్తృతంగా ఫ్యాక్టరీల వద్ద, కార్మికుల పని ప్రదేశాల్లో, కాలనీల్లో ప్రచారం చేపట్టాలన్నారు. 35 సంవత్సరాలలోపు ఉన్న కార్యకర్తలను రెడ్ షర్ట్ కవాతుకు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 15న వాడవాడలా జెండాలు ఎగరవేయాలన్నారు. జిల్లాలో గ్రూపు మీటింగులు, జనరల్ బాడీలు ఏర్పాటు చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమాలను ప్రజలకు వివరించాలన్నారు. లేబర్ కోడ్స్ ప్రమాదాన్ని కార్మికులకు తెలియజేయాలన్నారు. మహాసభలు విజయవంతం అయ్యే వరకు కార్యకర్తలు పట్టుదలగా కృషి చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, బిహెచ్‌ఇఎల్, విశాఖ పోర్ట్, జివిఎంసి, ముఠా, బిల్డింగు, హాస్పిటల్, ఆశ, రక్షణ రంగం వంటి అనేక సంఘాల నాయకులు పాల్గొని మహాసభల విజయవంతం కోసం ఇప్పటివరకు వారు చేసిన కృషిని వివరించారు.

నేవీ మారథాన్‌కు స్పందన

అందించారు. తీరంలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. విజేతలకు 10 లక్షలకు పైగా నగదు బహుమతులు అందించారు. గీతం మెడికల్ హాస్పిటల్ అద్వర్యంలో వైద్య సేవలు ఏర్పాటు చేశారు. మారథాన్‌లో పాల్గొన్న ప్రతి రన్నర్‌కు టీ షర్ట్, నేవీ థీమ్‌తో కూడిన పతకం, అల్పాహారం అందించారు.

ఎన్‌సిసి ఉత్సాహం

నేవీ మారథాన్‌లో ఎన్‌సిసి బెటాలియన్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్థ విశాఖపట్నం గ్రూప్ కమాండర్ సుమంత్ రాయ్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నీరజ్ కుమార్ హాజరయ్యారు.

బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంపు అవాంఛనీయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ : ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఈ నెల 12న పలు కార్పొరేట్ అనుకూల ఆర్థిక సంస్కరణలకు ఆమోదం తెలిపిందని, అందులో భాగంగా బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) పరిమితిని 100 శాతానికి పెంచిందని, అలాగే బీమా చట్టాల సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ తెలిపారు. ఈ చర్యలు అవాంఛనీయమని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేటి తరుణంలో ఎఫ్‌డిఐ పరిమితిని 100 శాతానికి పెంచడం, విదేశీ మూలధనానికి పూర్తి స్థాయి స్వేచ్ఛ ఇవ్వడం పూర్తిగా అవివేకమైన చర్య అని తెలిపారు. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాకుండా, దేశీయ బీమా సంస్థలకు కూడా తీవ్రమైన దుష్పరిణామాలను తీసుకువస్తుందన్నారు. ఇప్పటికే ఉన్న బీమా కంపెనీలను విదేశీ సంస్థలు శత్రుత్వపూరితంగా స్వాధీనం చేసుకునే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తపరిచారు. బీమా రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని పెంచే నిర్ణయాన్ని ఎఐఐఇఎ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇన్సూరెన్స్ యాక్ట్ 1938, ఎల్‌ఐసి యాక్ట్ 1956, ఐఆర్ డిఎ యాక్ట్ 1999లకు ప్రతిపాదిస్తున్న సవరణలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

డాక్టర్ డివిఎస్‌వై.శర్మకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లో పనిచేస్తున్న డాక్టర్ డి.వి.ఎస్.వై.శర్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్టాత్మక బాధ్యతలు లభించాయి. ఈ నెల 24 నుంచి 30 వరకు ఇండోర్‌లో జరగనున్న అఖిల భారత అంతర్-సంస్థల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ఆల్ ఇండియా ఎల్‌ఐసీ జట్టుకు మెంటార్‌గా ఆయన నామినేట్ అయ్యారు. అంతేకాకుండా 2026 జనవరి 1 నుంచి 11 వరకు గుజరాత్ వడోదరలో జరగనున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఆయన బ్లూ బ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా ఎంపికయ్యారు. డాక్టర్ శర్మ ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గాను సేవలందిస్తున్నారు. ఆయన ఈ అరుదైన ఘనతలు సాధించిన సందర్భంగా ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్‌దాస్, యూనియన్ నాయకులు జి.వరప్రసాద్, ఎం.కామేశ్వరి, ఎల్‌ఐసీ ఉద్యోగులు ,విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మెగావైద్య శిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు వైద్యశిబిరానికి హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సిఐ గొలగాని దివాకర్‌యాదవ్ అవసరమైన వారికి మందులతో పాటు స్నాక్స్ కూడా అందజేసి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా సిఐ దివాకర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రజలకు వివిధ అంశాలపై తాము అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని వాటితో పాటు మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. తొలిసారిగా చేసిన ఈ ప్రయత్నం విజయవంతమైందన్నారు.

పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో..

జివిఎంసికి మూడు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ గ్రోత్ ప్రెజర్వింగ్ రూట్స్ ద పిఆర్ విజన్ ఆఫ్ 2047' థీమ్‌తో ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు తలపెట్టిన 47వ అఖిల భారత పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ - 2025లో జివిఎంసికి మూడు ప్రతిష్టాత్మక పిఆర్‌ఎస్‌ఐ - 2025 జాతీయ అవార్డులు దక్కాయి. ఈ విషయాన్ని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం మీడియాకు తెలిపారు. 13వ తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేయగా 14న అవార్డుల ప్రదానోత్సవం జరిగిందన్నారు. ఉత్తరాఖండ్ శాసనసభ స్పీకర్ రీతూ ఖండూరీ భూషణ్, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమేష్ పోఖ్రియల్ నిశాంక్, పిఆర్‌ఎస్‌ఐ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అజిత్ పాఠక్ చేతుల మీదుగా ఈ అవార్డులు దక్కాయి. విశాఖ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కౌన్సిల్ సభ్యులు అందించిన నిరంతర సహకారం, భాగస్వామ్యం, ప్రోత్సాహంతో జివిఎంసి అమలు చేసిన ప్రజా సంక్షేమం, మహిళల సాధికారత, అభ్యున్నతి, మహిళల ఆర్థిక బలోపేతం, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా అవగాహన, ప్రచార, సామాజిక మాధ్యమ కార్యక్రమాలు, బాల్యం విద్యా కేంద్రాలలో బాలల ఆరోగ్యం, విద్య, భద్రత, పోషణ, సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాలకుగానూ జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు లభించిందని కమిషనర్ తెలిపారు. ఈ అవార్డులను జివిఎంసి తరపున అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, పౌర సంబంధాల అధికారి ఎన్.నాగేశ్వరరావు అందుకున్నారన్నారు.



అవార్డు అందుకుంటున్న రమణమూర్తి, నాగేశ్వరరావు

జాతీయ అవార్డుల కేటగిరీల వివరాలు

బెస్ట్ సిఎస్ఆర్ ప్రాజెక్ట్ ఫర్ చైల్డ్ కేర్ విభాగంలో జివిఎంసికి ప్రథమ స్థానం దక్కింది. బెస్ట్ యూజ్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ ఎ కార్పొరేట్ క్యాంపెయిన్‌లో ప్రథమ స్థానం, ఉమెన్ ఎంపవర్మెంట్ అండ్ కమ్యూనిటీ డెవలప్మెంట్‌లో ద్వితీయ స్థానం దక్కాయి.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమేదీ ?



మాట్లాడుతున్న మోహనరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వంలో స్పష్టత కొరవడిందని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు అన్నారు. ఆదివారం ఎంవిపి కాలనీలోని ఎల్‌ఐసి ఐక్యతా భవన్‌లో జరిగిన యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా 50వ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కారవుతాయని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. ఆర్థిక బకాయిలు అలానే ఉన్నాయన్నారు. 12వ పిఆర్‌సి అమలు కాలేదని తెలిపారు. పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడంలో సైతం కాలయాపన చేస్తున్నారన్నారు. నాలుగు డిఎలు చెల్లించాల్సి ఉండగా కేవలం ఒక్క డిఎతోనే సరిపెట్టడం దారుణమన్నారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలను ఆరు మాసాలలోగా రోడ్ మ్యాప్ ప్రకటించి చెల్లిస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం రూ.8500 కోట్ల బకాయిలను మాత్రమే చెల్లించిందని, మిగతా 25 వేల కోట్ల బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును ఆసరాగా చేసుకుని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను నిర్వహించడం తగదన్నారు. 25 ఏళ్ల పైబడి సర్వీసును పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు ఇప్పుడు పరీక్షలు పెట్టడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. బోధనేతర కార్యక్రమాలలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయబోమనే మాటకు కట్టుబడాలని డిమాండ్ చేశారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి పోరాట కార్యక్రమాలను రూపొందించేందుకు జనవరి 3, 4న పశ్చిమ గోదావరిలోని భీమవరంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ సహధ్యక్షురాలు ఎన్.అరుణ కుమారి అద్వర్యంలో నిర్వహించిన ఎన్నికలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగేశ్వరరావు, అంబేద్కర్



యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులుగా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టిఆర్.అంబేద్కర్, గౌరవాధ్యక్షులుగా అనకాపల్లి పైడిరాజు, సహధ్యక్షులుగా కె.ముత్యాలనాయుడు, మహిళా సహధ్యక్షురాలుగా ఎ.విజయకుమారి, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా చుక్క సత్యం, మహ్మద్ రిజ్వాన్, రామకృష్ణ, రాజునాయుడు, సిహెచ్.సంతోష్, శ్రీనివాస రాజు, వంగా రామలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్‌గా తాడాన అప్పారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రియాజ్ అహ్మద్, సభ్యులుగా వివి.గిరి, అడిగార్ల శ్రీనివాస్ కుమారి, శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేటి నుంచి అఖిల భారత డ్వాక్రా బజార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మహిళల స్వయం సాధికారతను సాధించేలా, ఆర్థిక బలోపేతాన్ని పెంచేలా, స్వయం ఉపాధిని ప్రోత్సహించే విధంగా 12 రోజుల పాటు నిర్వహించతలపెట్టిన సరస్ ఎగ్జిబిషన్ సోమవారం నుంచి ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ మీడియాకు తెలిపారు. ఈ ప్రదర్శన సోమవారం నుంచి ఈనెల 26 వరకూ ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ఎస్‌హెచ్‌జి. మహిళలు పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 250 స్టాళ్లలో ఉత్పత్తులు కొలువుదీరనున్నాయని వెల్లడించారు.

ఏదీ గత వైభవం..?

- ఎండిన ఆకులు, చెదిరిన రూపు రేఖలు
- ఇదీ వందేళ్ల ముడసర్లోవ ఉద్యానవనం దుస్థితి..



కళావిహీనమై శిథిలమవుతున్న మెట్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : అటు పచ్చని సింహగిరులు, ఇటు వైపు కొండల నుంచి గల గల పారే సెలయేరులు, మధ్యలో రిజర్వాయర్‌తో ప్రకృతి రమణీయత ఉట్టిపడే విధంగా ఉద్యానవనాన్ని 1902లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. నాటి నుంచి కొన్ని దశాబ్ధాల పాటు విశాఖ వాసులకు ఆహ్లాదం పంచింది. 1980 దశకంలో పదుల సంఖ్యలో సినిమాలు ఇక్కడ చిత్రీకరించారు. అలాంటి ఉద్యానవనం పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎండిన ఆకులు, చిరిగిన పగోడాలు, కూలిన గోడలు, పగిలిన టైల్స్‌తో వచ్చిన సందర్శకులను ఎక్కిరిస్తూ నేడు రూపు రేఖలు లేకుండా పోయింది. కార్తీక మాసం వచ్చిందంటే చాలు నగర వాసులకు, బయట నుంచి వచ్చిన వారికి గుర్తు వచ్చేది ముడసర్లోవ పార్కు ప్రధానమైనది. అటువంటి పార్కును పాలకులు గాలికి వదిలేసారు. పాలకులు ఇక్కడకు వచ్చి ప్రపంచ స్థాయి ఉద్యానవనంగా అభివృద్ధి చేస్తామని ప్రణాళికలు వేయడమే తప్ప ఆచరణలో పెట్టడం కనిపించలేదు. వాస్తవంగా ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. కొత్తగా ఒక్క మొక్క కూడా నాటించలేదు. ఉన్న మొక్కలకు నీరు పోసి సంరక్షించే పాపాన పోలేదు. హుదూద్ తుపాన్‌కు పడిపోయిన రక్షణ గోడను ఇప్పటి వరకు పునర్నిర్మించలేదు. అవసరం లేకున్నా కోట్లు వెచ్చించి రిజర్వాయర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించారు. పార్కుకు ఆనుకొని ఉన్న రోజ్ గార్డెన్‌లో ధనికులు ఆడేందుకు మరో రూ 3 కోట్లు వెచ్చించి హార్స్ రైడింగ్ నిర్మించి మధ్యలో ఆపేసారు. వీటిలో సగం వెచ్చించినా ముడసర్లోవ పార్కు అందంగా తయారయ్యేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ముడసర్లోవ పార్కుకు పూర్వ వైభవం తెవాలని సందర్శకులు కోరుతున్నారు.



కూలిన షెల్టర్

నేరాలు ఘోరాలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్
ఇద్దరు యువకుల దుర్మరణం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలో ఎం జగన్నాధపురం గ్రామ సమీపంలో శనివారం రాత్రి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాద సంఘటనలో బైక్‌పై ప్రయాణం చేస్తున్నా ఇద్దరు యువకులు సంఘటనా స్థలంలో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం ప్రమాదానికి సంబంధించిన వివరాలివి. మునగపాక మండలం గణపర్తి గ్రామంలో శనివారం రాత్రి గౌరీ పరమేశ్వర ఉత్సవ సందర్భంగా బోగాది ధను విజయ్ ఇంటికి శనివారం రాత్రి తన స్నేహితులు దూళి దుర్గ, ఇంటి జగన్ వెళ్లారు. పండగ చూసుకుని తిరిగి 11 గంటల సమయంలో గణపర్తి గ్రామం నుంచి బైక్ పై బయలుదేరారు . ఎం జగన్నాధపురం గ్రామంలో టిఫిన్ చేశారు. జగన్నాధపురం గ్రామంలో జగన్ అనే కుర్రవాడు ఉండిపోయాడు. ధను విజయ్, దుర్గ ఇద్దరూ బైక్‌పై బయలుదేరారు. రాత్రి సమయంలో మంచు ఎక్కువగా పడడంతో రహదారిపై కనిపించక ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని బైక్‌తో ఢీకొట్టారు. బైక్‌పై ప్రయాణం చేస్తున్న ఇద్దరికీ తీవ్రమైన గాయాలై, అధిక రక్తస్రావం జరిగింది. రహదారిపై వెళ్లే స్థానికులు ప్రమాద సంఘటనను గమనించి అందరికీ తెలియపరచడంతో వెంటనే ఇద్దరు క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో తరలించారు. ఎన్టీఆర్ హాస్పిటల్‌లో వైద్యులు పరీక్షించి, అప్పటికే ఇద్దరూ చనిపోయినట్లు నిర్ధారించారు. ప్రమాద సంఘటనపై భోగాది లక్ష్మి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పండగ సందర్భంగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి .

యువతిని మోసగించిన యువకుడు అరెస్ట్

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానని వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన తొండంగి మండలం వేమవరం గ్రామానికి చెందిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు పాయకరావుపేట పోలీస్‌స్టేషన్‌లో సిఐ జి అప్పన్న తెలిపారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పాయకరావుపేట పోలీసులు శనివారం స్థానిక వై జంక్షన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకొని ఎలమంచిలి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ అతనికి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడి నుంచి ఎంఫిల్డ్ బుల్లెట్ ను స్వాధీన పరుచుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన పాల ట్యాంకర్
- డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలోని కేబీ రోడ్డులో కొద్దిరోజులుగా వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి తాజాగా ఆదివారం తెల్లవారుజామున బుచ్చయ్యపేట వద్ద రోడ్డుపక్క విద్యుత్ స్తంభాన్ని, ట్రాన్స్ఫార్మర్ దిమ్మను పాల ట్యాంకర్ ఢీకొట్టిది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో డ్రైవర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బిఎన్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇటీవల కాలంలో వాహనాలన్నీ కెబి రోడ్లోనే వెళుతున్నాయి. విశాఖడెయిరీ నుండి బుచ్చయ్యపేట బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్‌కు 100 మీటర్ల దూరంలోనే ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.



తిమ్మాపురంలో వాలిపోయిన కరెంటు స్తంభానికి ఊతగా పెట్టిన కర్ర

వంతెనకు అడ్డు కాదు... ఉపాధిని కాపాడండి..

ప్రజాశక్తి-మధురవాడ : చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద నిర్మించదలచిన నడక వంతెనకు తాము అడ్డు కాదని, తమ బతుకు తెరువు కోసం అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మధురవాడ శ్రీ పైడితల్లమ్మ వృత్తిదారులు, చిల్లర వర్తకుల సంఘం సభ్యులు స్పష్టంచేశారు. వంతెన నిర్మాణానికి సహకరించాలని, మిగిలిన స్థలంలో గోడ పక్కన స్థలంలో చిన్న చిన్న బ్బడ్డీలు పెట్టుకోవడానికి అవకాశం కల్పిస్తామని మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు హామీ ఇచ్చి, ఇప్పుడు పూర్తిగా తీసేయాలని, లేకపోతే ధ్వంసం చేస్తామని హెచ్చరించడం అన్యాయమని పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ మధురవాడ కూడలి వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ వృత్తిదారులు, చిరు వర్తకులకు వంతెనకు ఆటంకం లేకుండా కొంత స్థలం కేటాయించాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బి.శ్రీను, పి.సంతోష్, కె.నారాయణరావు, కె.వీరంశెట్టి, ఎల్.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, ఎన్.రామారావు, టి.ఈశ్వరమ్మ, గంగరాజు, బి.నూకరాజు, ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ జంక్షన్‌లో ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

విద్యుత్ స్తంభానికి కర్ర ఊత

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం పంచాయతీ పరిధి తిమ్మాపురం గ్రామంలో కరెంటు స్తంభానికి కర్రను ఊతగా నిలబెట్టారు. స్తంభం పక్కగా కింద భాగంలో 4 అడుగుల గొయ్యి తవ్వి దాన్ని పూడ్చకుండా విడిచిపెట్టడంతో పక్కకు ఒరిగిపోయింది. దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. స్తంభాన్ని నిటారుగా నిలబెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శనకు స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్ దయాల్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో నో ప్రాఫిట్, నో లాస విధానంలో దుప్పట్లు, చీరలు, టవల్స్, పాదరక్షలు, నేచురోపతి, ఆయుర్వేదిక్ మందులు తదితర 30 స్టాళ్లను ఏర్పాటుచేశారు. ప్రారంభించిన గంటల వ్యవధిలోనే వస్తువులన్నీ అమ్ముడుపోయాయి.

ప్రమాదాలకు నిలయంగా మలుపు



కోరుకుపోయి ప్రమాదకరంగా మారిన రహదారి

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస బిపి.కల్లాలు రోడ్డులో శుభశ్రీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో రోడ్డు పూర్తిగా శిథిలమై ఒకవైపు కుంగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై కంకర రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్డు ఒకవైపు ఎత్తుగా, మరోవైపు కుంగిపోయి ఉండటంతో వాహనాలు బోల్తా పడుతున్న ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. గతంలో రోడ్డు మధ్యలో ఉన్న భగీరథ మంచినీటి పైపుకు మరమ్మత్తులు చేయడంతో నీరు వృథాగా పోయి, మట్టి కిందకు దిగిపోయి పెద్ద గోతులుగా మారింది. దీంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు తక్షణమే రోడ్డు మరమ్మత్తులు చేపట్టి వాహనదారులకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



రాళ్లు తేలిన రహదారి

కిడ్నీ బాధిత బాలునికి సహాయం

ప్రజాశక్తి -తగరపువలస : భీమునిపట్నం మండలం తాళ్లవలస గ్రామంలో జరిగిన వన సమరాధనలో నాగవంశానికి చెందిన బాలుడు సంజీవికి కిడ్నీ ఆపరేషన్ నిమిత్తం రూ.20 లక్షలు కావాలని, సహాయం చేయాలని నాగవంశం రాష్ట్ర ప్రెసిడెంట్ అప్పలనాయుడు పిలుపుకు నాగ వంశీయులు స్పందించారు. వెంటనే లక్షలు సహాయం ప్రకటించారు. ప్రభుత్వం నుంచి రూ.20 లక్షలు ఇప్పిస్తానని కార్పొరేషన్ చైర్మన్ రమణారావు ప్రకటించారు. మరో రూ.10 లక్షలు నాగవంశియులు ప్రకటించారు.



బాలునికి సహాయం చేస్తున్న నాగవంశం ప్రతినిధులు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే నాట్స్ ధ్యేయం



ప్రొడక్షన్ బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న ప్రసన్నకుమార్ తదితరులు

పోలీస్ ధైర్యసాహసాలపై సినిమా

ప్రజాశక్తి -తగరపువలస : పోలీసుల ధైర్యసాహసాలు ఇతివృత్తంగా 40 రోజుల్లో సినిమా చిత్రీకరణ చేస్తామని నటుడు, 9 నంది అవార్డుల గ్రహీత ఐ.ప్రసన్నకుమార్ చెప్పారు. సినిమా నిర్మాత భీమిలి ప్రాంతానికి చెందిన బిల్డర్ బుగత నరసింగరావుతో లొకేషన్స్ చూసేందుకు ఆదివారం ప్రసన్నకుమార్ వచ్చారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ సినిమాకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నేరస్తులకు మించి పోలీసులు తెలివికలవారనే సన్నివేశాలతో సినిమా నడుస్తుందని చెప్పారు. పోలీసులు సమాజానికి చేస్తున్న సేవలు, చూపించే ధైర్య సాహసాలతో సినిమా తీసి ఆ వ్యవస్థ ప్రతిష్ఠ పెంచేలా కథ ఉంటుందని చెప్పారు. సినిమాకు బుగత నరసింగరావు నిర్మాతగా తాను డైరక్షన్ చూస్తున్నానని తెలిపారు. విశాఖ పరిసర ప్రాంతాలలో 40 రోజుల్లో సినిమా షూటింగ్ చేసి పూర్తి చేస్తామని చెప్పారు. స్థానిక నటులకు సినిమాలో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సినిమాతో పోలీసులంటే గౌరవ భావం కల్పిస్తామన్నారు. బిఎన్‌ఆర్ ప్రొడక్షన్‌పై నిర్మిస్తున్న సినిమాలో పాటలు కూడా ఉంటాయని చెప్పారు. సమావేశంలో లిఖిత పాల్గొన్నారు.



రక్త దానం చేస్తున్న సన్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు

79 మంది రక్తదానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ వేదికగా ఆదివారం నిడీ వెల్ఫేర్ అసోసియేషన్, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 79 మంది రక్త దానం చేశారు. రక్త దానం చేసిన వారికి బ్లిస్ కేటరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీలావణ్య బహుమతులు అందజేశారు. విశాఖ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు. అనంతరం రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు, సిబ్బంది సహకరించారు. పాఠశాల డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, స్థానికులు డాక్టర్ ఎన్.ఎల్.రావు, గంటా నూకరాజు, ఎం.షణ్ముఖరావు, ఎం.సూర్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి వైసిపి ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు జిల్లా అధ్యక్షులు కెకె.రాజు ఆధ్వర్యాన చేపట్టే ర్యాలీని విజయవంతం చేయాలని 45వ వార్డు వైసిపి పరిశీలకులు మేరువ గణేష్ పిలుపునిచ్చారు. వార్డులో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వైసిపి వార్డు అధ్యక్షులు పైడి రమణ, నాయకులు హరి పట్నాయక్, సతీష్, దుర్గేష్, సన్నీ, నేపాల్ శ్రీను, గణపతి, భరత్, నరసారావు, గోవింద్, సువర్ణ, తవుడమ్మ పాల్గొన్నారు.

జివిఎంసి 46వ వార్డు పరిధి అధ్యక్షులు బలిరెడ్డి గోవిందరాజు ఆధ్వర్యాన డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కో ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. ర్యాలీలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి గోవిందరాజు, ఎంవి.రాఘవులు, కె.చిన్నా, దూది నరసింగరావు, కోటరామారావు, సింగంపల్లి రామారావు, ఎన్ ఈశ్వరరావు, కె.లావణ్య పాల్గొన్నారు.


45వ వార్డులో సమావేశమైన మేరువ గణేష్ తదితరులు

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గాజువాక : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ధ్యేయమని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. నడుపూరు హైస్కూల్లో నాట్స్ తయారుచేసిన గ్రీన్ స్టూడియో రూమ్‌ను, అందులో నాట్స్, గ్లో, రోటరీ క్లబ్ విశాఖ సౌత్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన పూర్తిస్థాయి ఎక్విప్‌మెంట్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రీన్ స్కూల్ కాన్సెప్ట్ వినూత్నంగా ఉందని, దీనిని నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని ప్రాథమిక పాఠశాలల్లో అమలుచేయాలని ఎంఇఒను ఆదేశించారు. నాట్స్ ప్రెసిడెంట్ ఎం.శ్రీహరి మాట్లాడుతూ, భాషే రమ్యం- సేవే గమ్యం అనే నినాదంతో నాట్స్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా ఆటోనగర్ డ్రైవర్స్ కాలనీ చుట్టుపక్కల ఉన్న 9 పాఠశాలలను దత్తత తీసుకొని అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. గ్లో సెక్రటరీ వెంకన్న చౌదరి మాట్లాడుతూ, పిల్లలలో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ గ్రీన్ స్టూడియో కాన్సెప్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో నాట్స్ తమను భాగస్వామ్యం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను బయటికి తీయడానికి అన్ని స్కూళ్లలో ఇలాంటి గ్రీన్ స్టూడియోలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. దీనిలో భాగంగానే

ఉత్తర అమెరికా తెలుగు సంఘం, రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌత్, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ సహకారంతో గాజువాక మండల పరిధిలో ఉన్న చట్టివానిపాలెం, పాత గాజువాక, డ్రైవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాలలకు రూ.2 లక్షల విలువైన టీచింగ్ ఎయిడ్ మెటీరియల్ అయిన తెలుగు, హిందీ, ఇంగ్లీష్ వర్ణమాల చార్టులు, గ్లోబు, చిన్న పిల్లలకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. నాట్స్ ఈసీ మెంబర్ కిరణ్ మందాడి పాల్గొన్నారు.


గ్రీన్ స్టూడియో రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

విజనరీ ఇన్‌సైట్స్ వార్తాలేఖకు జాతీయ అవార్డు



వార్తాలేఖలోని విషయాలను పరిశీలిస్తున్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి

ప్రజాశక్తి- వేపగుంట : కంటి రోగులకోసం శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆసుపత్రి నెలవారీ ప్రచురిస్తున్న విజనరీ ఇన్‌సైట్స్ వార్తాలేఖకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. 'విజనరీ ఇన్‌సైట్స్'కు రెండవ బహుమతి లభించినందుకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి అభినందించారు. ఈ నెల 13వ తేదీ రాత్రి డెహ్రాడూన్‌లో జరిగిన 47వ అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సును పుష్కర్‌సింగ్ ధామి ప్రారంభించారు. వార్తాలేఖను దానిలోని విషయాలను ముఖ్యమంత్రి ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి తరపున రాజ్యసభ సభ్యులు నరేష్ బన్సల్ అవార్డులను ప్రదానం చేశారు. విజనరీ ఇన్‌సైట్స్ ఎడిటర్, శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు ఈ అవార్డును అందుకున్నారు. పిఆర్‌ఎస్‌ఐ జాతీయ ఛైర్మన్ డాక్టర్ అజిత్ పాఠక్, సెక్రటరీ జనరల్ డాక్టర్ పిఎల్‌కె.మూర్తి, ఇతర విశిష్ట ప్రముఖుల సమక్షంలో శంకర్ ఫౌండేషన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకుంది. జాతీయ స్థాయిలో ఈ గుర్తింపును శంకర్ ఫౌండేషన్ వరుసగా రెండవ సారి దీంచడం గమనార్హం. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి గౌరవాన్ని సాధించినందుకు 'విజనరీ ఇన్‌సైట్స్' ఎడిటర్ కె.బంగార్రాజుకు, సంపాదక బృందానికి శంకర్ ఫౌండేషన్ ఛైర్మన్, బోర్డు ఆఫ్ ట్రస్టీస్ ఎం.రాందాస్, మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, ట్రస్టీలు ఎ.ప్రసన్న కుమార్, ఎ.విజయ కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ అభినందనలు తెలిపారు.


నిరాశ్రయులకు దుప్పట్లు అందజేస్తున్న యువ చైతన్య ట్రస్టు సభ్యులు

నిరాశ్రయులకు దుప్పట్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : యువ చైతన్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిరాశ్రయులకు దుప్పట్లు అందజేశారు. రైల్వేస్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, కాన్వెంట్ జంక్షన్, ఆర్‌కె.బీచ్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నిద్రిస్తున్న నిరాశ్రయుల వద్దకు ట్రస్టు సభ్యులు వెళ్లి దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ పి.బాలరాజు మాట్లాడుతూ, ఏటా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నవీన్, రాకేష్, అశోక్, నవీన్ కుమార్, మణివర్మ మనోజ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

సాయి మాధవనగర్ సమస్యలపై వినతి

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధి సాయి మాధవనగర్ కాలనీ సమస్యలపై వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నాకు సాయి మాధవ నగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. సాయి మాధవ నగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధుల ఆహ్వానం మేరకు సమావేశానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ రాపర్తి కన్నా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలపై కార్పొరేటర్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా కాలనీలో చిల్డ్రన్ పార్క్ ఏర్పాటుచేయాలని, సెక్టార్ 1 నుండి సెక్టార్ 2 గెడ్డపై వంతెన నిర్మించాలని, కాలనీలో ఉన్న సీనియర్ సిటిజన్లకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ ఇప్పటికే సుమారు రూ.3 కోట్లతో సాయి మాధవ నగర్ కాలనీలో రోడ్లు, పార్కు, గెడ్డలకు రిటైనింగ్ వాల్, వినాయకుని ఆలయం ముందు కమ్యూనిటీ స్టేజ్, తారు రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తన దృష్టికి వచ్చిన సమస్యలను కూడా పరిశీలించి మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చంటి, రెడ్డి గోపాలరావు, స్వామి, కిషోర్, బాబూరావు, గౌరీశంకర్, కర్రీ రాజు, డిఇ వర్మ, జనార్ధనరావు, డి.వి.రమణారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ రాపర్తి కన్నాకు వినతిపత్రం అందిస్తున్న సాయి మాధవనగర్ వాసులు

భవానీ జ్యూయలరీ ప్రారంభం

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి చినముసిడివాడ ఎంఆర్.ప్లాజాలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీభవానీ జ్యూయలరీని కొర్తు చిత్రం కథానాయకి శ్రీదేవి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, కోళ్ల లలితకుమారి, మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వసంత శంకర్రావు, ముమ్మన దేవుడు, షాపింగ్ మాల్ అధినేతలు బత్తిన గౌరీశంకరరావు, భవాని, సిబ్బంది జి.అశోక్, చందు, లోకేష్, నాని, చంద్రశేఖర్ పాత్రో, అరుణపాత్రో తదితరులు పాల్గొన్నారు.


భవానీ జ్యూయలరీ ప్రారంభంలో కథానాయకి శ్రీదేవి

కాలువలపై నిర్మాణాలు : రోడ్డుపైకి మురుగు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని ఆనందపురం పంచాయతీ పరిధి కోనవారి వీధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సిసి రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామంలోని కొందరు కాలువపైనే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించే అవకాశం లేకుండాపోతుంది. మురుగునీరు రోడ్డుపైకి చేరి ప్రవహిస్తోంది. మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రయాణం కష్టంగా మారిందని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, కాలువను పూర్తిగా శుభ్రం చెయ్యాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కుట్ర

కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నీరుగార్చే కుట్రలను ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. రెక్కాడితే గాని డొక్కాడని పేదల కోసం, గ్రామీణ ప్రాంత నిరుద్యోగాన్ని ఎదుర్కొనేందుకు, వ్యవసాయ కూలీలకు కనీస ఉపాధిని గ్యారెంటీ చేయడానికి 2005లో వామపక్షాల ఉద్యమంతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టాన్ని అప్పటి కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఒక సాధారణ సంక్షేమ పథకంగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలందరూ ప్రతిఘటించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తరపున పిలుపునిచ్చారు. నేటి వ్యవసాయ సంక్షోభంలో కనీసం 200 పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన సవరణ బిల్లు, పేరు మార్చడానికి మాత్రమే ఉద్దేశించింది కాదని, అది పూజ్య బాపూజీ గ్రామీణ రోజ్ ఘార్ యోజన పేరుతో చేసిన సవరణ చాలా ప్రమాదకరమైందన్నారు. ఉద్దేశపూర్వకంగా మహాత్మాగాంధీ పేరు తొలగించడమే కాక, దీని ప్రకారం చట్టం కాస్తా పథకంగా మారుతుందన్నారు. పథకం అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుందని, ఇప్పటి వరకూ గ్రామీణ పేదలు అనుభవిస్తున్న ఉపాదిహామీ చట్టం కల్పించిన హక్కు రద్దవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 100 రోజుల పనిదినాన్ని 125 రోజుల పనిదినాలుగా పెంచుతూ చేసిన నిర్ణయం హర్షణీయమే అయినప్పటికీ, ఈ పథకం ఎత్తివేయడానికి బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగమే ఇది అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో కుటుంటానికి 100 రోజులు పనిదినాలు గ్యారెంటీగా కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం సగటున 50 పని దినాలు కూడా కల్పించలేదన్నారు. చట్ట ప్రకారం పని కల్పించని రోజులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, అయితే మోడీ ప్రభుత్వం దీనిని ఎక్కడా అమలు జరపలేదన్నారు. భూస్వాములు, పెత్తందార్ల ఒత్తిళ్ళకు లొంగి క్రమంగా ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు పథకంగా పేరు మారుస్తుందన్నారు. కోట్లాది మంది పేదలకు సంబంధించిన ఈ పథకాన్ని ఒకేసారి ఎత్తివేస్తే పెద్ద ఎత్తున తిరుగుబాటు వస్తుందని, అంచెలంచెలుగా ఎత్తివేసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్రపన్నుతుందని ఎద్దేవా చేశారు. అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి ఉద్దేశపూర్వకంగానే ప్రతి సంవత్సరం కేటాయింపులు తగ్గించి వేస్తున్నారని వాపోయారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని కోరిన ప్రతి ఒక్కరికీ 15 రోజులలోగా పని కల్పించక పోతే నిరుద్యోగ భతి ఇవ్వాలని, ఈ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి జాబు కార్డులను అధిక సంఖ్యలో రద్దు చేస్తున్నారన్నారు. అలాగే చట్టంలో పేర్కొన్నట్లు పని ప్రదేశంలో కల్పించాల్సిన సౌకర్యాలను ఎత్తివేస్తున్నా రన్నారు. ఇప్పటి వరకు హక్కుగా ఉన్న ఈ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకడమే గాకుండా వ్యవసాయ వేతనాల స్థిరీకరణకు కూడా కొంత వరకు తోడ్పడిందన్నారు. అలాగే వలసలు కొంత వరకు అరికట్టబడ్డాయని, పట్టణాలకు కూడా ఈ పథకాన్ని విస్తరించాలని వామపక్షాలు డిమాండ్ చేస్తుండగా ఉన్న పథకాన్ని నీరుగార్చడం క్షంతవ్యం కాదన్నారు. ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుటిల యత్నాలను అందరూ ప్రతిఘటించి సిపిఎం విజ్ఞప్తి చేస్తోందన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో గీతాలక్ష్మికి స్వర్ణం


లాంగ్ జంప్‌లో సత్తా చాటిన చోడవరం సబ్ రిజిస్ట్రార్



మొదటి స్థానంలో నిలిచిన గీతాలక్ష్మి

ప్రజాశక్తి- చోడవరం : రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చోడవరం సబ్ రిజిస్ట్రార్ బి గీతాలక్ష్మి లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణం సాధించారు. ఇటీవల గుంటూరులో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్‌లో అమె సత్తా చాటారు. చోడవరంలో వివిధ సంఘాలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమౌతున్నారు. పిచ్చిమొక్కలతో నిండి ఉన్న చోడవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో చొరవ చూపారు. మాస్టర్ అథ్లెటిక్స్ లాంగ్‌జంప్‌లో స్వర్ణం పతకం సాధించిన గీతాలక్ష్మిని పలువురు అభినందించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-. అనకాపల్లి : స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. 50 మంది దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు బుద్ధ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ఆపద సమయంలో ఎంతోమందికి రకాన్ని అందించి, వారి ప్రాణాలను కాపాడడంలో రోటరీ సంస్థ ఎప్పుడు ముందుంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులైన కోరిబిల్లి పరి, గుండా సాయి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించారని తెలిపారు.కార్యక్రమంలో కార్యదర్శి ప్రకాశరావు, ట్రైనర్ సత్యనారాయణ, క్లబ్ సభ్యులు సతీష్, కేఎల్ఎన్ కుమార్, పలువురు రొటేరియన్స్ పాల్గొన్నారు.

ఏడో రోజుకు రిలే దీక్షలు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్

ప్రజాశక్తి- మునగపాక: మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మెయిన్ రోడ్‌లో నాగులపల్లి, అరబుపాలెం, రాజుపేట, కాకరపల్లి, ఒంపోలు పేట గ్రామాల నాయకులు చేపట్టిన ఏడవ రోజు రిలేదీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌కు తాము వ్యతిరేకం కాదని, అదే సమయంలో దగ్గరలో ఉన్న అనకాపల్లి నుంచి మార్పుచేసి సుదూర ప్రాంతంలో ఉన్న నక్కపల్లి రెవిన్యూ డివిజన్ లో మునగపాక మండలాన్ని చేర్చడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ మలసాల కుమార్ రాజా, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చుయ్య నాయుడు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి నరేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వరమే పరిష్కారం అవుతాయని పదవ అడిషనల్ జిల్లా జడ్జి వి నరేష్ అన్నారు. న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ పి నాగేశ్వరరావు, అడిషనల్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ జి రామకృష్ణ, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి ధర్మారావు, ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ ఏ రమేష్, సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి బివి విజయ లక్ష్మి, థర్డ్ అడిషనల్ సివిల్ జడ్జ్ నికితా సెంగర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిళ్ల హర శ్రీనివాసరావు, కార్యదర్శి బి వెంకటరావు పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో మొత్తం కేసులు 2053 సెటిల్మెంట్ అయ్యాయని, రికవర్ అయిన మొత్తం రూ. 6,19,89,730 కక్షిదారులకు చెల్లించడం జరిగిందని జడ్జి నరేష్ తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి -కశింకోట : ఐదునెలల వేతన బకాయి చెల్లించాలంటూ కశింకోట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం తాత్కాలికంగా విరమించారు. వేతన బకాయి, ఇతర సమస్యలపై ఈనెల 13నుంచి పంచాయతీ కార్మికులు సమ్మెకు ఉపక్రమించగా, ఆదివారం పంచాయతీ కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు జి. కొండబాబు, దేవుడు, సిఐటియు నాయకులు దాకారపు శ్రీనివాసరావులతో కూటమి నాయకులు సిదిరెడ్డి శ్రీనివాసరావు,తాకాసి కృష్ణ, కాంట్రాక్టర్ చేవ్వేటి నాగరాజు జరిపిన చర్చలు ఫలవంతం కావడంతో సమ్మె విరమిచారు. 15వ ఆర్థికసంఘం నిధులు విడుదలైన వెంటనే పారిశుధ్య కార్మికులకు వేతనం చెల్లించడానికి ఒప్పందం కుదిరింది. పారిశుధ్య కార్మికుల్లో క్రిస్టియన్లు ఉండడంతో వారికి క్రిస్మస్ పండగకు ముందుగానే ఈనెల 20న ఒక నెల వేతనం చెల్లించడానికి కాంట్రాక్టర్ నాగరాజు ఒప్పుకున్నారు. అలాగే పనిముట్లు, భద్రతా పరికరాలను వారంలోగా ఇస్తామని ఇఒపిఆర్‌డి మాటివ్వడంతో సమ్మెకు తాత్కాలికంగా ముగింపు పలికారు. కాగా మిగతా బకాయిలు సంక్రాంతికి ముందు చెల్లించేలా కూటమి నేతలు, అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే సమ్మె కొనసాగిస్తామన్నారు.కార్యక్రమంలో శివ, లక్ష్మణ, అర్జునమ్మ, సత్తిబాబు, సూరిబాబు, సన్యాసమ్మ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

త్రోబాల్ విజేత రాంబిల్లి మహిళా టీచర్లు



విజేత బహుమతి అందుకున్న రాంబిల్లి మహిళా టీచర్లు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి డిగ్రీ కళాశాల మైదానంలో డివిజనల్ స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు రెండోరోజు ఆదివారం ఉత్కంఠభరిత వాతావరణంలో ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ ఫైనల్ పోటీల్లో రాంబిల్లి మండల క్రీడాకారులు విజేతగా నిలవగా, అనకాపల్లి మండల మహిళా టీచర్లు రన్నరప్‌గా నిలిచారు. డిఇఓ పి. అప్పారావునాయుడు విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. సోమవారం పురుషుల క్రికెట్ సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన జట్లను జిల్లా స్థాయికి పంపనున్నారు. ఎంఇఓ అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు అంజాద్, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



దేవరాపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడిలోని అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులంతా రైవాడ జలాశయం వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులందరూ ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకుని, చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తాము చదువుకున్న తెనుగుపూడి గురుకుల పాఠశాలకు రూ.లక్ష విలువ చేసే నిత్యావసర సామాగ్రిని అందజేశారు. పాఠశాలకు ఉపయోగపడే వంట పాత్రలు, క్రీడా మైదాన పరికరాలు, ప్రవేశ పరీక్షల పుస్తకాలు, పరీక్షా సామాగ్రి, తినుబండారాలు వంటి సామాగ్రిని సమకూర్చారు. పూర్వ విద్యార్థి సీఐ సింగపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో మండ శ్రీనివాసరావు, రెడ్డి కష్ణ, ప్రకాష్, ఎస్. వెంకటరమణ, కె. నాగ అప్పారావు, పి. మధుసూదనరావు, దొండ వెంకటరావు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల చొరవను పూర్వ ప్రిన్సిపాల్ ఎస్. నారాయణరావుతో పాటు, ప్రస్తుత ప్రిన్సిపాల్ విక్టర్ పాల్, పీడీ ఉమామహేశ్వరరావు, పిఇటి తరుణేశ్వరరావు అభినందించారు. విద్యార్థులు తమ పాఠశాల పట్ల చూపిన ప్రేమ, నిబద్ధత ఆదర్శప్రాయమని వారు కొనియాడారు.

ములగాడ : హిందూస్తాన్ షిప్‌యార్డ్ 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ ఒక చోట కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ సంతోషంగా గడిపారు. విదేశాల్లో ఉన్న వారు సైతం హాజరుకావడంపై అందరిలో సంతోషం వ్యక్తమైంది. అందరూ ఆటపాటలతో గడిపారు. అప్పట్లో విద్య నేర్పించిన గురువులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల్లో ఉద్యోగ విరమణ చేసిన కొందరిని సన్మానించారు. ఆదివారం పెళ్లి రోజు చేసుకుంటున్న దంపతులను సత్కరించి కేక్ కట్ చేశారు.



ఒకేచోట కలుసుకున్న షిప్‌యార్డు స్కూల్ పూర్వ విద్యార్థులు

నేడు అమరజీవి వర్ధంతి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాముల 73వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 15న జగన్నాథ థియేటర్ వద్ద రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పొట్టి శ్రీరాములు ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా 73మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ



హార్ట్‌ఫుల్‌నెస్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు, నిర్వాహకులు

ప్రజాశక్తి- కశింకోట : పర్యావరణ పరిరక్షణ ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీ రామచంద్ర సంస్థ హార్ట్ ఫుల్‌నెస్ ధ్యానకేంద్రం నిర్వాహకులు అన్నారు. ఆదివారం ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో కశింకోట జాతీయ రహదారి నుంచి ధ్యాన కేంద్రం వరకు గ్రీన్ హార్ట్ ఫుల్‌నెన్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన స్థానిక సిఐ అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ యువతకు డ్రగ్స్ ను దరిచేయనీయొద్దని కోరారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచి, ఇంటింటా పచ్చని వాతావరణాన్ని నింపాలని పిలుపునిచ్చారు, హార్ట్ ఫుల్‌నెస్ ధ్యానాన్ని అలవాటు చేసుకుని మానసిక ప్రశాంతత, సామరస్య జీవన విధానాన్ని సొంతం చేసుకోవాలని కోరారు. సమాజంలో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లి గురుదేవ్, లక్ష్మణయ్య, మురళీమోహన్, కెఎస్‌కె రావు, భారీసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

ప్రకృతి సమతుల్యతపై అవగాహన



గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రకృతి సమతుల్యత కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇఎన్‌టి వైద్యులు కె విష్ణుమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ నేచర్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే ప్రకతి సమతుల్యత కాపాడాలన్నారు. సమస్త జీవరాసుల ఆరోగ్య మనుగడకు, సుస్థిర అభివృద్ధికి సహజ ఆవరణ వ్యవస్థ అవసరం అన్నారు. గ్రీన్ క్లబ్ గౌరవ సలహాదారు, విశ్రాంత అటవీ శాఖ అధికారి వినోద్ కుమార్ గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనకాపల్లి జీవీఎంసీ హై స్కూల్ నుంచి రింగ్ రోడ్డు రైల్వే స్టేషన్ మీదుగా అవగాహన ర్యాలీ సాగింది. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, భోగ లింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ(ఎస్ఎఫ్ఐ), కుంచం నూకయ్య శెట్టి, ఎ.శ్రీనివాస్, పి సురేష్, గంట్ల కృష్ణ, వై సంతోష్, రావూరి అనిత, కర్రి నీలవేణి, కె. అనిల్ పాల్గొన్నారు.

16 నుంచి 'లక్ష' ప్రదర్శన

ప్రజాశక్తి - అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం జగన్నాథ స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఈనెల 16 నుండి వచ్చేనెల 16 వరకు జరిగే లక్ష ప్రదర్శన జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ దాడి బుజ్జి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ సూచనల మేరకు ఆలయ ప్రాంగణంలో మొట్టమొదటిసారిగా లక్షప్రదర్శన కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. 220ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో జరిగే లక్ష ప్రదర్శనలో భక్తులు, స్థానికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విల్లూరి హరికష్ణ, ఆలయ ధర్మకర్తలు బుద్ద ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, బుగతా కోటేశ్వరరావు, ఎండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి సుబ్రహ్మణ్యం, బొడ్డేడ చలపతి రావు, ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం



అతిథులను సత్కరిస్తున్న కాలేజీ యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : :విద్యా సంస్థల నిర్వహణలో పోటీతత్వం ఉన్నా, సమస్యలు ఎదురైనప్పుడు ఐక్యమత్యంతో పరిష్కరించుకోవాలని విశ్రాంత వీసీ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు సూచించారు. ఆదివారం మండలంలోని చౌడువాడ ప్రైవేటు రిసార్ట్స్‌లో ఎపి ప్రైవేట్ జూనియర్ కాలేజీ మేనేజమెంట్స్ అసోసియేషన్(ఎపిజెఎంఎ) అనకాపల్లి జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. అయ్యన్న జూనియర్ కాలేజీ కరెస్పాండెంట్ డాక్టర్ ఖాశీం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదితున్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యంలను అభినందించారు. ఇంటర్ విద్య అర్‌ఐఒ.వినోద్‌బాబు మాట్లాడుతూ పరీక్షల ఫలితాల్లో ఉత్తమ మార్కులతో అనకాపల్లి జిల్లాను రాష్ట్రంలోప్రథమ స్థానంలో సూచించారు.

ఎపిజెఎంఎ.రాష్ట్ర అధ్యక్షులు వివి.ప్రసాద్, కార్యదర్శి వైఎస్ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేట్ జూనియర్ కాలేజీలలో మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు సాధనకు నిబద్ధత, అంకిత భావంతో బోధన చేస్తున్నాయన్నారు .జిల్లా అధ్యక్షులు జనార్ధన్ మాట్లాడుతూ అందరినీ సమన్వయం చేసుకుంటూ ఇంటర్ విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు.రాష్ట్ర డిగ్రీ కాలేజీల మేనేజమెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమణాజీ మాట్లాడుతూ ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కాలేజీలు కృషి, సమస్యలను వివరించారు. సమావేశంలో జె.ఎం.ఎ.రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శేషగిరి, జిల్లా కార్యదర్శి కష్ణ మోహన్ మాట్లాడుతూ పలు ప్రైవేట్ జూనియర్ కాలేజీల కరెస్పాండెంట్స్ పాల్గొన్నారు.

'ఎడతెగని జ్ఞాపకాల్లో' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సాహితీ మిత్రుల్లో ఒకరైన కోరాడ అప్పలరాజు రచించిన 'ఎడతెగని జ్ఞాపకాల్లో' అనే పుస్తకం ప్రస్తుత సమాజానికి అద్దం పడుతుందని మాజీ ఎంపీ డాక్టర్ బివి సత్యవతి అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక వివేకానంద సమావేశ మందిరంలో ఎడతెగని జ్ఞాపకాల్లో పుస్తకావిష్కరణ జరిగింది. ప్రముఖ కవి మెరుగుమిల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సాహితీ రంగంలో అనకాపల్లికి ప్రముఖ స్థానం ఉందన్నారు. ఇటువంటి రచనలు మరిన్ని ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంఇఒ కోటేశ్వర రావు, అనకాపల్లి సాహితీ మిత్రులు పృథ్వీరాజ్, మువ్వల రాంబాబు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

స్మార్ట్ లైఫ్ జాకెట్లతో మత్స్యకారుల ప్రాణరక్షణ



దాడి తేజను అభినందిస్తున్న రాంకీ

ప్రజాశక్తి-అనకాపల్లి : సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో జరిగే ప్రమాదాల్లో మత్స్యకారులకు ప్రాణరక్షణగా ఉండేందుకు 'అలర్ట్ 24 స్మార్ట్ జాకెట్'ను రూపొందించిన దాడి తేజను ఆదివారం రింగ్ రోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామ్ కి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సముద్రంలోచేపల వేటతో జీవనోపాధి సాగిస్తున్న మత్స్యకారులు ఎంతోమంది సముద్ర అలల ఉధృతికి గల్లంతై మృత్యువాత పడుతున్నారని, గడిచిన 14 ఏళ్లలో నాలుగు వేలమంది మత్స్యకారులు ఇలాగే ప్రాణాలు కోల్పోయారన్నారు.ఇటువంటి పరిస్థితుల్లో మత్స్యకారులకు ప్రాణరక్షణగా లోతైన సముద్రంలోనూ కచ్చితంగా స్థానాన్ని ట్రాక్ చేస్తూ 20 రోజుల పనిచేయగల సామర్థ్యం ఉన్న బ్యాటరీతో పనిచేయగల జిపిఎస్‌ను అనుసంధానం చేస్తూ అలర్ట్ 24 స్మార్ట్ లైఫ్ జాకెట్ ను రూపొందించిన దాడి తేజ విశాఖ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం అభినందనీయమన్నారు. ఈ జాకెట్లు సైనికులకు, టూరిస్టులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటూ, ఎంతోమంది ప్రాణాలు కాపాడొచ్చని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పూసపాటి భరత్ బాబు, చదరం నాగేశ్వరరావు, ఆళ్ల రామచంద్రరావు, మంగ ఈశ్వర్, బంటు రవి, హరి పాల్గొన్నారు.

ఎంవిఆర్‌ను కలిసిన హైదరాబాద్ వ్యాపారవేత్తలు

ప్రజాశక్తి-.అనకాపల్లి : పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు(ఎంవి.ర్) ను ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్తలు నరసింగరావుపేట ఎంవిఆర్ స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వ్యాపార రంగంతోపాటు రాజకీయాల్లోనూ ఎంవిఆర్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కష్టాన్ని నమ్ముకొని ముందుకు వెళ్తే అనుకున్నది సాధిస్తారనేది ముత్యాల వెంకటేశ్వరావును చూసి నేర్చుకోవచ్చన్నారు. తమ లాంటి ఎందరో వ్యాపారస్తులకు సహాయ సహకారాలు అందిస్తూ, చేదోడుఉంటున్న ఎంవిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్ల పోటీల నిర్వహణ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- మునగపాక: రానున్న సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రం మునగపాకలో ఎడ్లబండ్ల పోటీల నిర్వహణకు ఆదివారం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షులుగా పెంటకోట విజయ్, ఉత్సవ కమిటీ చైర్మన్‌గా దాడి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులుగా కోరుకొండ రాంప్రసాద్, వేగి , కోశాధికారిగా విల్లూరి నూక నరసింహారావుతో పాటు పెంటకోట శ్రీరామ్మూర్తి, ఆడారి కన్నబాబు, ఆడారి గోవింద, రామప్ప నాయుడు, వెలగా మురళి, ఆడారి లక్షణరావు, కాండ్రేగులు భాగ్యరాజు, ప్రసాద్, సరగడం జగ్గలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు దాడి శివ, పిఎసిఎస్ అధ్యక్షులు నూక నర్సింగరావు తెలిపారు. సూరిశెట్టి అప్పలనాయుడు, ఆడారి పరశురాం, సూరిశెట్టి దుర్గ నాయుడు, పెంటకోట వెంకటరావు, దాడి భీమ నాయుడు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాలు, దుప్పట్లు



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కిరణ్‌శర్మ

ప్రజాశక్తి.-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన శ్రీవేద సంస్కృతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాడేరు మన్యంలోని పలు గ్రామాల గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు ట్రస్టు చైర్మన్ పసరకొండ కిరణ్‌శర్మ తెలిపారు. పాడేరు సమీప మినుములూరు, 12వ మైలురాయి, అమ్మవారి పాదాలు, డల్లాపల్లి, లడ్డాపుట్, హుకుంపేట గ్రామాల్లోని 100 గిరిజన కుటుంబాలకు రగ్గులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టు కార్యదర్శి నందనశర్మ, నిట్టల కృష్ణప్రసాద్, కప్పగంతుల సాయిమురళి, పెచ్చేట్టి గోవింద్ పాల్గొన్నారు.

దిబ్బిడిలో 'విద్యార్థి మేలుకో'

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : విద్యా శాఖా ప్రతిష్టత్మాకంగా తీసుకున్న పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికను 'విద్యార్థి మేలుకో' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దిబిడి గ్రామంలో గల పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇంటి వద్ద టెన్త్ విద్యార్థుల సన్నద్ధతపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్లకు టీవీలకు టెన్త్ విద్యార్థులను దూరంగా ఉండాలని, చదివేందుకు అనువైన వాతావరణం కల్పించాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తమ ఫలితం సాధించ వచ్చునని, విద్యార్థులకు తమ తల్లిదండ్రులు సహకరించాలని ఉపాధ్యాయులు ఎవిఎన్ మూర్తి సూచించారు

సమస్యల పరిష్కారానికి హామీ

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : యలమంచిలి ఎంపిపిగా రాజాన శేషు పూర్తి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆదివారం మొదటిసారిగా జంపపాలెం గ్రామాన్ని సందర్శించారు. ముందుగా జంపపాలెం గ్రామ దేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత కూటమి నాయకులుతో వెళ్లి గ్రామ సందర్శన చేసి, ప్రజలు నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శారదా నదికి వద్ద స్నానాల ఘాట్ నిర్మించాలని, శ్మశానవాటికను బాగుచేసి, ప్రహరీ నిర్మించాలని, ఇలా పలు సమస్యలను కొత్త ఎంపిపి దృష్టికి తీసుకెళ్లారు .దీనిపై రాజాన శేషు స్పందిస్తూ, సమస్యలను ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మాస్టార్లూ మీకిది తగునా!



చిందర వందరగా పడేసిన భోజన ప్లేట్లు, ఇతర వ్యర్థాలు

ప్రజాశక్తి - యలమంచిలి టౌన్ : యలమంచిలి డిగ్రీ కళాశాల మైదానంలో అనకాపల్లి జోనల్, డివిజనల్ స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు రెండో రోజు ఆదివారం కొన సాగాయి. క్రీడామైదానంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం తర్వాత తిన్న ప్లేట్స్, మంచి నీరు పాకెట్లు అక్కడే వదిలేసారు. ఆ ప్లేట్లులో మిగిలిన ఆహారాన్ని సాయంత్రం పందులు, కుక్కలు తినేందుకు వచ్చి ఎంగిలి ప్లేట్లును చిందర వందర చేశాయి. దీంతో ఆ ప్రాంతమంతా అపారిశుధ్యమయంగా తయారైంది. ఆటల పోటీలు కొనసాగనుండడం, కాలేజీకి విద్యార్థులు నెలకొన్న నేపథ్యంలో ఇక్కడ నెలకొన్న పరిస్థితులు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ఆదర్శంగా ఉండాల్సిన మాస్టార్లు ఆదామరిచారా, లేకపోతే అశ్రద్ధ వహించారా? ఏదేమైనా ఇటువంటి చర్యలతో ఇతరులు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి కల్పించడం సరికాదని పలువురు అంటున్నారు.

వంద రోజుల ప్రణాళికపై ఫోకస్

- టెన్త్ విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- మార్కులను బట్టి గ్రేడులుగా విభజన, ప్రత్యేక తరగతులు
- పర్యవేక్షణలో నిమగ్నమైన అధికారులు


దేవవరం హైస్కూల్లో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న హెచ్ఎం నూకరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధికార యంత్రాంగం ఫోకస్ పెట్టింది. లక్ష్య సాధనకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, పాఠశాలల్లో అమలయ్యే విధంగా జిల్లా, మండల స్థాయి అధికార యంత్రాంగం పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 6వ తేదీ నుండి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

మండలంలో 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, గురుకులం పాఠశాలలతో కలిపి 900 మంది వరకు విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమల్లో భాగంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉదయం 8 నుండి 9 గంటల వరకు టెన్త్ విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుండి 5 వరకు ఒక సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష పెట్టి,మార్కుల ఫలితాలను సంబంధిత యాప్ లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. విద్యార్థుల మార్కులను బట్టి షైనింగ్ స్టార్స్ (ఏ గ్రేడ్), రైజింగ్ స్టార్స్ (సి,డి గ్రేడ్)లుగా విద్యార్థులను గుర్తించి మార్కుల ఆధారంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి, వారిని కూడా ఏ గ్రేడ్ స్థాయికి పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంది.

ప్రభుత్వ, అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికను ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 6 వ తేదీ నుండి ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం అమలు తీరు పై జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాలల్లో ఈ కార్యక్రమం పక్కాగా అమలు జరిపే విధంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఈనెల 9వ తేదీన నక్కపల్లిలో కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని సందర్శించి, వంద రోజుల కార్యాచరణ అమలు తీరును పర్యవేక్షించారు. విద్యార్థులతో ముచ్చటించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు ఆమె సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, శత శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు.

మండలంలో ఆదివారం దేవవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఇంగ్లీష్, ఫిజికల్ సైన్సు తరగతులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు పర్యవేక్షించారు. మండలంలో ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యా యుల ఆధ్వర్యంలో ఆదివారం ఇంగ్లీష్, ఫిజికల్ సైన్స్ తరగతులు నిర్వహించారు.

పక్కాగా కార్యాచరణ ప్రణాళిక అమలు

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనకు ప్రత్యేక దృష్టి సారించాం.ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అన్ని పాఠశాలల్లోనూ పక్కాగా అమలయ్యే విధంగా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నాం. అన్ని పాఠశాలల్లోనూ కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలు జరుగుతుంది. ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టడం జరిగింది. పూర్తిగా సన్నద్ధం చేస్తున్నాం



కె నరేష్,
ఎంఈఓ


బహుమతులు ఇస్తున్న నిర్వాహకులు

చెస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:మాకవరపాలెం మండలం మాకవరపాలెం గ్రంథాలయంలో ఆదివారం చెస్ పోటీలను ప్రగతి చెస్ వెల్ఫేర్ అసోసియేషన్ (కన్నూరు పాలెం), శ్రీ గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం (మాకవారపాలెం) ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంటును మాకవరపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.నారాయణరావు ప్రారంభించారు. మాకవరపాలెం, నర్సీపట్నం, , తామరం, గిడుతురు వివిధ గ్రామాల నుండి టోర్నమెంటుకు పోటీదారులు పాల్గొన్నారు. విజేతలకు మెమెంటోలను నిర్వాహకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రగతి చెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి డి.వి. సుధీర్ కుమార్, టోర్నమెంట్ నిర్వాహకులు పి.రంగరాజు, గౌతమి లలిత శిక్షణ కేంద్రం వ్యవస్థాపకులు పి.ఆదినారాయణ మాస్టారు, లైబ్రేరియన్ చంద్రకళ పాల్గొన్నారు.


తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-రావికమతం: కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తక్షణమే తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని మండలంలో చీమలపాడు పంచాయతీ శివారు పెదగరువు పివిటిజి కొంది గిరిజన గ్రామస్తులు పాలిక రవి, రాము తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెదగరువు పివిటిజి కొంది గిరిజన గ్రామంలో 13 కుటుంబాలు జీవనం సాగిస్తున్నా యన్నారు. ఈ కుటుంబాల మధ్యలో ఉన్న కరెంటు స్తంభం తుప్పు పట్టి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణంలోనైనా విరిగి ఇల్లపై అవకాశం ఉందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

హస్తకళలకు పూర్వ వైభవం తేవాలి

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు


కళాకారులకు పనిముట్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ:మన ప్రాంతానికి గర్వకారణమైన హస్తకళలను కాపాడుకుంటూ, రాబోయే తరాలకు ఈ నైపుణ్యాలను అందించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో ఆదివారం కేంద్ర, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న కళాకారులకు పనిముట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్పీకర్ అయ్యన్న 50 మంది హస్త కళాకారులకు సుమారు రూ.5లక్షల విలువ చేసే కార్పెంటరీ టూల్ కిట్లను (వుడ్ కార్వింగ్ పనిముట్లు) ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, మన ప్రాంతంలో ఏటికొప్పాక బొమ్మలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. వస్తువులను తయారు చేయడంతో పాటు, వాటిని మార్కెటింగ్ చేసుకోవడం కూడా కళాకారులకు ఎంతో ముఖ్యమని సూచించారు. సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేక కళాకారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, విశాఖలోని లేపాక్షి వంటి సంస్థలతో అనుసంధానం చేసి విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో కళాకారుడికి రూ. 10వేల విలువైన ఆధునిక పనిముట్లు ఇవ్వడంతో వారి పనిలో నాణ్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత కూడా ఈ కళల పట్ల ఆసక్తి పెంచుకుని, ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా ఆర్థికంగా ఎదగాలని అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హస్తకళల అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి, విశాఖ లేపాక్షి మేనేజర్ కార్తీక్, విజయవాడ లేపాక్షి ఫైనాన్స్ మేనేజర్ కుమార్, నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ రాజాన సూర్యచంద్ర, రాష్ట్ర అవార్డు గ్రహీత, ఏటికొప్పాక లక్క బొమ్మల కళాకారుడు పెదపాటి శరత్, మాజీ జడ్పీటీసీ, మండల టిడిపి అధ్యక్షులు చిటికెల తారక వేణుగోపాల్, మాజీ ఎంపీపీ అడిగర్ల అడిగర్ల అప్పలనాయుడు, ఇతర స్థానిక నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రాథమిక చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని తురువోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాధారణంగా వచ్చే వ్యాధులు, ప్రాథమిక చికిత్స పై అవగాహన కల్పించారు. ప్రముఖ వైద్యులు వెన్నుపూస బ్రహ్మారెడ్డి, కృష్ణాజీ (ప్రముఖ సైకాలజిస్ట్), మానస ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ప్రాథమిక చికిత్స కిట్లను డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి ఆర్థిక సహాయంతో అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సోమేశ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి -చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల సమస్యలను ఆదివారం భారత చైతన్య యువజన పార్టీ ప్రతినిధుల బృందం పరిశీలించింది.పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాలతో గోవాడ సుగర్స్ రైతులు కలిసి వివరాలు సేకరించారు. ఇటీవల రైతుల నుంచి సేకరించిన సంతకాల జాబితాను రైతు, కార్మిక నాయకులు గంటా సన్యాసినాయుడు, కె.భాస్కరరావు, ప్రతినిధులు నరసింహం, కోన గురవయ్య, బాలాజీలకు అందచేసి సమస్యలు వివరించారు. ఫ్యాక్టరీపై ప్రత్యక్షంగా పరోక్షంగా చోడవరం, మాడుగుల నియోజక వర్గాల పరిధిలో ఆధారపడి ఉన్న రెండు లక్షల మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. గత సీజనుల్లో సరఫరా చేసిన చెరకుకు డబ్బులు రూ.30కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందని, అలాగే కార్మికులకు రూ.ఏడు కోట్ల బకాయిలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న సీజనుల్లో క్రషింగ్‌కు ఫ్యాక్టరీ మిషనరీని సన్నద్ధం చేయాలని గతంలో మాదిరిగా రైతులకు ఉచితంగా దవ్వ, ఎరువులు అందజేసి చెరకు సాగును ప్రోత్సాహించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సమావేశంలో రైతులు, కార్మిక నాయకుడు భాస్కరరావు, రామారావు, వెంకట రమణ, రామకృష్ణ రాజు, శ్రీను, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బీమా పరిహారాన్ని అందిస్తున్న సత్యనారాయణ


పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

-విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి- వడ్డాది:పాడి రైతుల సంక్షేమమే లక్ష్యమని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. కోమల్లపూడిలో పాల సంఘ సభ్యురాలు శెట్టి అప్పలనర్స ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు విశాఖ డెయిరీ నుండి రూ.15000లు భీమా పరిహారాన్ని డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన పాలను సరఫరా చేసి డెయిరీ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. డెయిరీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశాఖ డెయిరీ ఎల్లప్పుడూ సామాజిక స్ఫూర్తితోనే పని చేస్తుందని గుర్తు చేశారు. ప్రతి రూపాయి సభ్య రైతుల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తుందన్నారు. మాజీ ఎంపీపీ ఎంవీవి సత్యనారాయణ, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షునిగా శివ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటకు కు చెందిన వాసుపల్లి శివ ఎంఎస్ఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షులుగా నియమితులయ్యారు.పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ప్రతినిధులు రాష్ట్ర కమిటీలో శివకు చోటు కల్పించి, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్, కె పోలయ్య, పేర్ల వెంకటేష్, కదిరి పోలరాజు, కె.మల్లయ్య, రాజుపాల్గొన్నారు.



నియామక పత్రం ఇస్తున్న ప్రతినిధులు

ఉపమాక క్షేత్రానికి ధనుర్మాస శోభ

-16 నుంచి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు క్షేత్రంలో ఉత్సవ సేవలను నిర్వహించనున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయం బయట, లోపల భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పెండాల్స్, కార్పెట్లు ఏర్పాటు చేశారు. 16వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12.57 గంటలకు ఆలయంలో అర్చక బృందం నేతృత్వంలో నెల గంటతో ధనుర్మాస ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఉపమాక గ్రామంలో నెల రోజుల పాటు మాఢవీధుల్లో వాహనాలపై స్వామివారిని పల్లకీపై తిరువీధి సేవలు నిర్వహిస్తారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా కొన్ని రోజులు రాత్రి వేళల్లో కూడా తిరువీధి సేవలు జరుగుతాయి. డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి రోజున ఆలయం భక్తులు రద్దీ నెలకొంటుంది. వైకుంఠ ఏకాదశి రోజున సాయంత్రం 8 వాహనాలపై స్వామి తిరువీధి సేవ జరగడం ఇక్కడ ప్రత్యేకత. అదేవిధంగా భోగి పండుగ రోజున గోదాదేవి అమ్మవారి కల్యాణం, కనుమ పండుగ రోజున స్వామివారి గిరి ప్రదక్షిణోత్సవం కన్నుల పండువగా జరుగుతుంది. అదే రోజు రాత్రి బంధుర సరస్సు వద్ద వున్న రాతి మండపం వద్ద కరి-మకరి సంవాదం నిర్వహిస్తారు. ఈనెల 16 నుండి ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వెంకన్న ఆలయం ధనుర్మాస శోభ సంతరించుకోనుంది.



ముస్తాబైన ఆలయ ప్రాంగణం

సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదానికి..

బహుముఖ ప్రచారం

▶▶ మల్కాపురంలో శ్రామిక సాంస్కృతిక ఉత్సవం

▶▶ దశమకొండలో ఉచిత వైద్య శిబిరం పలుచోట్ల పోస్టర్ల ఆవిష్కరణ

విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరుగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రచారం జోరందుకుంది. బహుముఖ కార్యక్రమాలు చేపడుతున్నారు. జివిఎంసి 70వ వార్డు పరిధి దశమకొండలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మల్కాపురం జోన్‌లో శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. పలుచోట్ల పోస్టర్లు ఆవిష్కరించారు.

ప్రజాశక్తి - ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన త్రినాధపురం జంక్షన్ వద్ద శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఈ సాంస్కృతిక కళారూపాలను మల్కాపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గొలగాని అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, మూఢనమ్మకాలు, మోసాలను కళ్లకు కట్టినట్టుగా తెలియజేసిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు బాల బయ్యన్నకు అభినందనలు తెలిపారు. కళాకారులు తమ కళలను ప్రదర్శించడానికి మంచి వేదిక అన్నారు.

సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, జనవరి 4వ తేదీన జరిగే ర్యాలీ, ప్రదర్శనలో కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలలో ప్రదర్శించిన కళాకారులకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ తరపున ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు పెంటారావు, పి.పైడిరాజు, జి.నరేష్, ఎస్.వాసు, పి.రామారావు, ప్రజానాట్యమండలి కళాకారులు ఆర్.తాతబాబు, నీలకంఠం, వై.గంగాధర్, బి.రాము, బి.ప్రసాద్, విసిసి సభ్యులు ఇ.అరుణ, బి.ప్రవీణ, ఎస్.కృష్ణవేణి, చాతుర్య, చిన్మయి పాల్గొన్నారు.

దశమకొండలో ఉచిత వైద్య శిబిరం

గాజువాక : సిఐటియు ఆల్ ఇండియా మహాసభల సందర్భంగా యూనియన్ గాజువాక కమిటీ ఆధ్వర్యాన ఎలైట్ డెంటల్, మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ సహకారంతో జివిఎంసి 70వ వార్డు పరిధి దశమకొండలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు ఎ.కిషోర్‌బాబు, డాక్టర్ ఎ.ప్రతిభ సుమారు 100 మందికి బిపి, సుగర్, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, దంత సంబంధిత సమస్యలపై పరీక్షించారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, సిఐటియు, సిపిఎం పోరాట ఫలితంగా ఈ కాలనీ ఏర్పాటైందని, పేదలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేయాలని భావించి డాక్టర్లు కిషోర్‌బాబు, ప్రతిభ సహాయంతో చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.లోకేశ్వరరావు, గొలగాని అప్పారావు, నర్సింగరావు, యువజన నాయకులు రమణ పాల్గొన్నారు.

కె.కోటపాడు : విశాఖపట్నంలో ఈనెల 31నుంచి వచ్చేనెల నాలుగు తేదీ వరకు జరుగు 18వ సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల నాయకులు ఈర్లే నాయుడుబాబు, గండి నాయినిబాబు కోరారు. ఆదివారం మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్సు రద్దు చేయాలని. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు అమలు, స్కీము వర్కర్స్, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులైజేషన్, వైద్యవిద్య ప్రభుత్వ రంగంలోని కొనసాగింపు, విద్యుత్ సంస్కరణ బిల్లును రద్దు, సోమనాథన్ కమిటీ సిఫార్సు మేరకు పంటకు గిట్టుబాటు ధర కల్పన, ఉపాధి హామీ పథకాన్ని పటిష్ట పరిచి, కనీస కూలి రూ.500 చెల్లింపు వంటి కార్మికులు, రైతులు, ప్రజాసమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కర్షకులు సంఘటిత అసంఘటిత కార్మికులు ఉద్యోగులు పాల్గొని మహాసభ జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు వనం సూర్యనారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్:విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు . ప్రసన్న పిలుపునిచ్చారు. వేములపూడిలో మహాసభలను జయప్రదం చేయాలని మిడ్డే మీల్ కార్మికులతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా. ప్రసన్న మాట్లాడుతూ, విశాఖపట్నంలో మొదటిసారిగా సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయన్నారు. మిడ్డే మీల్ కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఐడి కార్డులు ఇవ్వాలన్నారు. మెనూ చార్జీలు పెంచి గ్యాస్ పంపిణీ చేయాలన్నారు. 9,10 తరగతిలకు కుకింగ్ చార్జీలు అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు



మాట్లాడుతున్న సిఐ అప్పారావు



దశమకొండలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



కె.కోటపాడులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు



నర్సీపట్నంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

టౌన్ షిప్‌కు భూములిచ్చేది లేదు..

గ్రామసభలో తేల్చి చెప్పిన రైతులు, నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి:ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్‌కు భూములు ఇచ్చేది లేదని మండలంలో నెల్లిపూడి గ్రామానికి చెందిన రైతులు, నాయకులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ఆదివారం రాత్రి గ్రామంలో భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతులు గ్రామసభ నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తదితర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి నాయకులు మాట్లాడుతూ, కొబ్బరి, మామిడి వంటి ఉద్యానవన తోటల ఫల సాయంతో ఈ ప్రాంత రైతులు కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఇటువంటి నేపథ్యంలో రైతుల నుండి బలవంతంగా భూములు తీసుకుంటే రైతులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు.ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ ప్లాంట్ భూసేకరణకు 2024 నవంబర్ 26న ఇచ్చిన జీవో నెంబర్ 76 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రైతుల మనోభావాలను అర్థం చేసుకొని భూసేకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు.అభివృద్ధి అంటే పరిశ్రమలు ఏర్పాటు ఒక్కటే కాదని, వ్యవసాయ రంగంను కూడా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులుఎస్.నరసింహమూర్తి, మణిరాజు, ఎస్.గోవిందరావు, ఎల్.చంద్రరావు, జీ వెంకటరమణ, వర్మ, అవతారంరాజు, మోహనరావు, ,టి.జోగిరాజు, టి.వెంకటరాజు, కె.నానీ, టి.అప్పలరాజు, బి.రాము, బి.గోవింద్, ఎస్.సాగర్, టి.పేర్రాజు, బి.తాతారావు, కె.రమణ, పి.కన్నంరాజు, జీ.తిరుపతిరావు, ఎం. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభకు హాజరైన రైతులు



అభివాదం చేస్తున్న నాయకులు